మూలం :

సుమథ్‌నాథ్ ఘోష్

అనువాదం :

శ్రీ నన్నపనేని సుబ్బారావు.

భర్త యెలా వుండాలా అని ప్రతిబాలిక తన మనస్సులో వూహించుకొంటూ వుంటుంది. కొంతమందికి అదృష్టబలంకొద్దీ కల్పనానుగుణ్యమైన భర్తలు లభిస్తారు. కొంతమందికి అదృష్టం కలిసిరాదు. వాళ్లు చాటుగా వొక్కయేడ్పు యేడ్చి వూరుకుంటారు. కాని ఆ కల్పనలోని నిగూఢ సత్యాన్ని కించిత్తుకూడా సందేహించటానికి వీల్లేదు. బాలికలు తరుణ తరళతలో, దీనినిగురించే రకరకాల చిత్రాలు లిఖిస్తూ, చెరిపివేస్తూ వుంటారు. అనాది నించీ ఇది యిలానే జరుగుతూ వస్తూంది.

ఇది అనివార్యంకూడా. ఎందువల్లనంటే బాలికల వివాహం మూడుముళ్లు పడగానే పూర్తి అయినట్టుకాదు. వాళ్ల తిండితిప్పలు మంచిచెడ్డలు, కష్టసుఖాలు, భవిష్యత్తు సమస్తమూ భర్తపైన ఆధారపడి వుంటుంది. అందువల్ల వివాహానికి, యెక్కడ లేని విలువ చేకూరింది. అమల విషయంలో దీనికి ఇంకాయెక్కువ ప్రాముఖ్యం వుంది.

ఆమెతండ్రి స్థితిపరుడు. ఆమెఅందగత్తె కాకపోయినా, బాగానేవుంటుం దని చెప్ప వచ్చు. ఆమె ఉన్నతవిద్య నభ్యసించింది; రెండు మూడుడిగ్రీలు వున్నవి; సితారు వాయిస్తుంది; పాడగలదు. నృత్యంకూడా చేస్తుంది. ఆమె యెన్నో స్వప్నాలు కంటూ వుంది వివాహాన్ని గురించి.

చిక్కు వచ్చింది కూడా ఇందువల్లనే. తల్లిదండ్రులికి నచ్చినవ్యక్తి, తనకి నచ్చడు. రాత్రులు మంచంపైన పరుండి స్వప్నలోకంలో విహరిస్తూవుంటుంది. పెళ్లిళ్లుఅయిన స్కూలు కాలేజి చెలికత్తెల భర్తల సంగతి పదే పదే తలపుకుతెచ్చుకుంటుంది. కాని వాళ్లలో ఒక్కరూ యోగ్యులుగా కనిపించటంలేదు. తన భర్త ఆ చెలికత్తెల భర్తలందరికంటె అన్నివిధాలా యోగ్యుడుగా వుండాలని ఆమెకోరిక. అందువల్ల అమలదిగులుకు అంతూ దరీ లేకుండా వుంది. అందరికంటె మిన్న అనిపించుకోటానికి, భర్త యేలా వుండాలా అని యెంత ఆలోచించినా, ఆమె ఒక నిర్ణయానికి రాలేకపోతూవుంది

డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు లక్షాధికార్లు—నిత్యమూ ఏన్నో సంబంధాలు వస్తున్నవి. లక్షాధికార్ల సంబంధాలన్నీ యేకైకపుత్రులవే! కాని అమలమనస్సు యెటూ మొగ్గలేకపోతూవుంది. డాక్టరనగానే, ఒక స్నేహితురాలి భర్త గుర్తుకొస్తాడు. ఆమె తండ్రి ఆమెకు డబ్బు పంపుతుంటాడు. దానితోనే ఆమె భర్త సూట్లు కుట్టించుకుంటాడు, సిగిరెట్లుకాలుస్తుంటాడు. ఈనాటికీ, యెర్రని యేగాని సంపాదించి యెరగడు. సూటు వేసుకుని, ఖాళీ సిగరెట్టు టిన్ను, టేబిలుమీదకొడుతూ మెడలో స్టెథస్కోపు వేసుకొని, డిస్పెన్సరీలో కూచుంటాడు. కాలం గడవనప్పుడు, వైద్యగ్రంథం తెరచి, దానిమధ్య, వాకబారు డిటెక్టివ్ నవల పెట్టుకుని, చాటుమాటుగా చదువుతూవుంటాడు.

తర్వాత అమలకి తన పినతల్లికూతురు సంగతి గుర్తుకొచ్చింది. ఆమెభర్తకూడా

డాక్టరు; కాని అతనికి భార్యతో కులాసాగా రెండుమాటలు మాట్లాడటానికయినా, తీరిక వుండదు. అర్థదాహం జాస్తి. ఇలాంటి వ్యక్తి తుచ్చుకుకూడా కొరకడు. బంధువుల యిళ్లకికూడా పెట్రోలు డబ్బులు పుచ్చుకోకుండా, రోగిని చూడటానికి రాడు. చాల కటువుగా మాట్లాడతాడు. తను యేదో వున్నతశిఖరంమీద వున్నట్లు వ్యవహరిస్తాడు. నర్సులతో, మిడ్‌వైఫ్‌లతో, చెడతిరుగుతాడని గోల! పాపం, అతనిభార్య, యీ సిగ్గుతోటే అయినవాళ్ల యింటికి వెళ్లటానికూడా సమ్మతించదు.

ఇంద్రబాబుతో మాత్రం యెవర్నీ పోల్చటానికి వీల్లేదు. అతను యేకపత్నీవ్రతుడు. ప్రతిమని తప్ప అన్య మెరుగడు. సజ్జనుడు, కాని ఇలాంటి భార్యాలోలుణ్ణి చూస్తే, ఆమె మనస్సు అసహ్యంతో నిండిపోతుంది. భార్యని కూచోబెట్టి, పొయ్యి రాజేస్తాడు. కూరలు తరుగుతాడు. భార్య జన్మజన్మాంతరాలకీ అతడేతన భర్తకావాలని కోరుకుంటున్నట్లు చెప్పినపుడు, అమల లోలోపల ఛీ, ఛీ అనుకుంది.

ఇలా, రాత్రిళ్లు కాబోయే భర్తగురించి ఆలోచించినకొద్దీ, అమల నెర్వస్‌నెస్ ఫీలవుతూవుంది. తనకి ఇలాంటివాడే దొరకుతాడేమో! అటువంటప్పుడు అవివాహితురాలుగా వుండిపోవటమే కోటిరెట్లు నయం! ఇలాంటివ్యక్తితో తను యెలాగూగడపలేదు!

భువనబాబుసంగతి గుర్తుకొచ్చినపుడు, ఆమెకు మరీ బాధ కలుగుతుంది. ఇంత కల్చరువున్న వ్యక్తులు చాలా అరుదు! కాని వొకరోజు మాలతిని కలుసుకుందామనివెళ్లితే భువనబాబు కింద కూచుని, పసిపిల్లకి అన్నం పెడుతున్నాడు. ఇదిసహించినా, అతనిమీద కలిగిన అభిప్రాయాన్ని మార్చుకోనక్కరలేదు. ఉదాహరణకి మరొక విషయం పేర్కొనవచ్చు. మాలతితనను టీకి ఆహ్వానిస్తే, ఒకసారివెళ్లింది. భువనబాబు పవిత్రాపవిత్రతలను నిర్దేశించే తల్లిముందర చిన్న అంగోస్త్రం చుట్టుకొని నిలబడివున్నాడు. తల్లి వచ్చి శిరస్సుమీద గంగాజలం చిలికే వరకు, లోపలికి వెళ్దామనే భావమే అతనికి కలిగినట్లులేదు. ఆనాటినుంచే భువనబాబంటే ఆమెదృష్టిలో విలువ లేకుండా పోయింది. అందరికంటే మాలతితోనే ఆమెకి యెక్కువ దోస్తీ! ఇద్దరూ చాలా అన్యోన్యంగా వుంటారు. మిడిల్‌స్కూలునించి ఫస్ట్ ఇయర్ దాకా కలిసి చదివారు. ఇద్దరూ ఒకేబస్సులో వస్తూ, పోతూ కబుర్లు చెప్పుకుంటూ వుండేవాళ్ళు. ఆ రోజు మాలతిని పక్కగదిలోకి పిలిచి - నువ్వు ఇదంతా యెలా సహిస్తున్నావు?, అని అడిగింది.

జవాబు చెప్పేటప్పుడు మాలతి కంఠస్వరం కంపించింది—"ఇంకా నువ్వు యేంచూసినట్లు అమలా? ఈ అత్తగారి మూలాన రోజూ మూడుసార్లు స్నానం చేయాలసివస్తూంది."

అమల విస్మితకంఠంతో — "కాళ్లూ చేతులూ కొంకర్లుపోయే ఈ చలిలో నా?... అమ్మయ్యో, అయితే యమయాతనే!" అంది.

మాలతి కనుకొలకుల్లోనించి, రెండు కన్నీటిచుక్కలు రాలినై. "నేను రోజూ పొటాసియమ్ సైనైడ్ తిని చచ్చిపోతే బాగుంటుం దనుకుంటాను."

అమల క్షణకాలం వూరుకుని—"భువనబాబుతో చెప్పక పోయావా?" అన్నది.

మాలతి కన్నీరు తుడుచుకుని.— "యెందుకు చెప్పలేదు? యెన్నిసార్లు చెప్పినా వారి నోటిమీదుగా వొకే జవాబు వస్తుంది. 'తల్లి వున్నన్నాళ్లు ఆమెయిష్టప్రకారం పోవలసిందే! ఆమెని కాదనటం బాగుండదు. యిదంతా సహించలేకపోతే, పుట్టింటికి వెళ్లివుండు. ముసలితల్లిని నేను యెలా వదలి" పెట్టను? "అని చెపుతూండగానే' ఆమె నేత్రాలు కన్నీటితో నిండిపోయినవి.

మళ్ళీకొంచెం ఆగి—"నా తల్లిదండ్రులు యెంతడబ్బు ఖర్చుపడి పెళ్లిచేసిందీ నీకు తెలుసు... పెళ్లి వొకరకంగా లాటరీ అని చెప్పవచ్చు. అమలా, నిన్ను ముందుగానే జాగ్రత్త పడమని హెచ్చరిస్తున్నాను." అని చెప్పి, మాలతి దీర్ఘంగా నిట్టూర్చింది.

మాలతివంటి నవనాగరికురాలికి యెంత దుర్గతి పట్టింది! అమల ఆమెసంగతి తల్చుకుని, చాలా వుద్విగ్నురాలై బాగా పొద్దుపోయేవరకు నిద్రపోలేకపోయింది.

అరుణబాబుసుమాత్రం సరైన వ్యక్తి అని చెప్పవచ్చు. పక్కాదొరలా వుంటాడు. సూటువేస్తాడు. యెప్పుడు నీటుగావుంటాడు. సూటు కొంచెం నలిగితేచాలు తీసివేసి కొత్తది వేస్తాడు. అజానుబాహువు; బంగారపుఛాయ, పెదవుల మధ్య పైపు పెట్టుకుని ఇంగ్లీషులో కమ్మగా మాట్లాడుతుంటే, సురమఅదృష్టానికి, అమల యీర్ష్యపడేది. నిజంగా సురమ అదృష్టవంతురాలు! చదువుమీద ఆమెకిధ్యాసే వుండేదికాదు క్లాసులో. చూడటానికయినా, బాగుండదు. ఆమె అదృష్టంకొద్దీ, సెకండ్ ఇయర్ చదువుతూండగానే తండ్రి గొప్పవాడు కావటంచేత యీ వివాహం జతపడింది. అరుణబాబు విదేశాల్లో ఇంజనీరింగు చదువుకొచ్చాడని, అమల అతన్ని చాలా శ్రద్ధగా చూసేది. కాని అతను వొక యంత్రాగారంలో పనిచేస్తున్నాడని వినగానే ఆ శ్రద్ధకాస్తా యెగిరిపోయింది. పొట్టకోసినా, అక్షరంముక్కలేని కార్మికుల మధ్య నివాసం! కార్మికచక్రవర్తి కావటం గొప్పవిషయ మేమీ కాదు!

అమలతండ్రి, ప్రొఫెసరు ప్రసక్తి తెచ్చాడు. అప్పటికీ ఆమె తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. ప్రొఫెసర్లు ఆమెదృష్టిలో విచిత్ర జీవాలు. వారిని విద్యాభారాన్ని మోసే గార్దభాలంటే చక్కగా అతికినట్టుంటుంది. నేత్రాల్లో, ముఖంలో, చురుకు అనేది కన్పించదు. కళ్లకి జోళ్లు, వదులువొక్కామీద మురికివొడే శాలువ! అడుగులు లెక్కపెట్టే నడక! చంకలో పుస్తకాల కట్ట! పాపం నవ్వుఅనేది యెరగరు. సరసతకి మైళ్ల దూరాన వుంటారు! ప్రపంచభారమంతా తమనెత్తిమీద పడినట్లు పోజు పెడతారు. ఈసందర్భంలో నీలిమభర్తసంగతి జ్ఞప్తికి రాగానే, అమల ఇప్పటికీ నవ్వుకుంటుంది. ఒకరోజు ఆ ఇంగ్లీషుప్రొఫెసరుతో కులాసాగా మాట్లాడాలని వెళ్లింది. కాని ఆయన భీరువుమాదిరి అమలవంక చూస్తున్నాడు. ఈపరిస్థితిలో ఆయనతో మాట్లాడేది యెలా!

అమల—"భయపడకండి. నేను మీ స్టూడెంటుని కాదు! నాముఖంవంక చూసి మాట్లాడితే మీకులం పోదు."

ఆపెద్దమనిషి అతికష్టంమీద ఆమెముఖం వంక చూస్తూ "యేమన్నారు" అన్నాడు.

ఇంతలో నీలిమ, గదిలోకి వస్తూ— "అమ్మో! ఇంకా అనేదేముంది.? అదిమీకు మరదలు అవుతుంది! మరదలి అందం చూసి, మతి భ్రమించిందా?" అన్నది.

ఆ పరిహాసంలో అమలకూడా శ్రుతికలపవలసివచ్చింది. తర్వాత నవ్వు ఆపుకొని— "సరేగాని, రాయ్‌గారూ, మా అక్కాయితో మాట్లాడేటప్పుడు, యెటు చూస్తుంటారు?" అన్నది అమల.

ఆయన సన్నని గొంతుతో— "మీఅక్కాయి యెదటే కూచునివుంది. ఆమెనే అడగకూడదూ?" అన్నాడు.

నీలిమ ముఖం కొంచెం పక్కకి పెట్టి— "ఇలాంటివి మా ఇళ్లలో చెప్పకూడదు!" అన్నది.

అమల ప్రశ్నించింది—"యెందువల్ల?... అప్పుడు కూడా స్టూడెంటుతో మాట్లాడుతున్నా ననుకుంటారా?"

నీలిమ—"నీకు తెలియదా? సినిమాకి యెన్నడూ వెళ్లరు. ఎవరైనా స్టూడెంటు చూస్తే, యింకేముంది? దురభ్యాసాలు అలవడత వేమో నని కిళ్లీ సిగిరెట్టు ముట్టరు. సన్నగుడ్డ కట్టరు. అది వీరి దృష్టిలో విలాసం కింద లెక్క!"

అమల—"ఏమండి, రాయ్ గారూ! ప్రొఫెసరీ చేసేటప్పుడు, ప్రపంచంలోని ఆమోదప్రమోదాలకి దూరంగా వుండమని యెక్కడైనా వ్రాసివుందా?"

ఈసారి ఆయన ముఖమెత్తి—మనదేశం సంగతి నాకు సరిగ్గా తెలియదు కాని విదేశాల్లో మాత్రం ప్రొఫెసర్లు సన్యాసుల వలె జీవితాన్ని గడుపుతుంటారు." అన్నాడు.

అమల వెంటనే— "మీకు ఇది తెలిసి వుండి, మా అక్కాయిని దేనికి పెళ్లి చేసుకున్నారు?" అన్నది.

"ఇదేగదా నాజీవితంలో చేసిన పెద్ద తప్పిదం! ఇప్పటి కయినా గూండాలు యెత్తుకపోతే, నాప్రాణాలు కుదుటబడతయ్" అన్నాడు రాయ్.

అమల ఆలోచనా ప్రవాహానికి మరొక నెచ్చెలి భర్తవిషయం అడ్డు తగిలింది. ఆయన వకీలు. పీక్కుపోయిన కోలముఖం. మాంధాతలనాటి పంట్లాము, రంగువెలిసిన నల్ల కోటు, చేతిలో దుమ్ముపట్టిన ఫైల్సు! రోజూ ట్రాముమీద వెళ్లి మునసబుకోర్టుకు హాజరవుతాడు. అక్కడ పడిగాపులు కాసి, నాలుగైదు కేసులు సంపాదిస్తాడు. ఉచ్చఆకాంక్ష అనేది అతని జీవితానికి వున్నట్టే లేదు. క్లయింటుని పట్టుకుని, పీడించో, భయపెట్టో, అబద్ధాలు చెప్పో, వీలున్నంతవరకు డబ్బు గుంజుతాడు. ఆ వకీలుయిల్లు, అమలయింటికి అనుకునే వుంది. ఒకనాడు - ఆయన, క్లయింటువద్ద యెలా డబ్బు వసూలు చేసిందీ కళ్లార చూసినప్పటినించీ, అమలకి అతని చదువుసంధ్యలమీద, సంస్కారంమీద తగని చీదర వేసింది. క్లయింటు నాదగ్గర ప్రస్తుతం డబ్బు లేదంటాడు. వకీలుగారు 'గుడ్డలుదులుపు, యేపక్కనో దాచివుంటావు' అంటారు. చివరికి క్లయింటువద్ద రెండు రూపాయలు గుంజిగాని, విడిచిపెట్టలేదు.

ప్లీడరీ అంటేనే, అమలకు గిట్టదు. అంతకంటె, అర్ధాకలితో కృశించి చావటం మెరుగు. భర్త జీవనోపాధి గౌరవప్రదమయినది కాకపోతే, అందులో తను స్వీకరించవలసినది కించిత్తుకూడా ఉండదు.

(36-వ పేజీ చూడుడు)

LTS 252-172 TL

కాల్పనిక జగత్తు

(19-వ పేజీ తరువాయి)

అమల యిలానే ఆలోచిస్తూ వుంటుంది. తన భర్త తిండి తిప్పలు చూసే యంత్రం గాని, సాధనంగాని కారాదు. అతని గౌరవానికి తను అభిమానపడాలి. ప్రజలకి భర్తని పరిచయం చేసేటప్పుడు, తన మోము ఉజ్వలం కావాలి!

వివాహవిషయంలో ఎక్కడ బోల్తా పడుతుందో ననే భయంతో ఎప్పుడూ చుట్టపక్కాలతో బాగా కలిసిమెలిసి తిరుగుతూ, వాళ్ల మనస్సులోని విషయాన్ని గ్రహించటానికి ప్రయత్నిస్తూవుంది. తరచు పేము గొడుగు చేత పట్టుకుని, యెవరి యింటికయినా వెళ్లుతుంటుంది. అక్కడ చర్చ సాగించి, వారి ఆంతర్యం గ్రహించడానికి యత్నిస్తుంది. కాని చిత్ర మేమిటంటే, యెవరి భర్తా ఆమెకి నచ్చలేదు. వాళ్లందరి కంటె తన భర్త అన్ని విధాలా గొప్పగా వుండాలి!

ఒకరోజు అమల తల్లి వచ్చి—"అమలా, అత్తాయి కూతురు ఆడబిడ్డ మరిది సంబంధం వొకటి వచ్చింది. అతను పుస్తకాలు రాస్తాడట. అందంగాకూడా వుంటాడట. అతని పేరు వింటేనే, నువ్వు వొప్పుకుంటావని చెప్తుంది అత్తాయి....నువు సోమనాథరాయ్ పుస్తకా లేమీ చదవలా అమలా?" అన్నది.

సోమనాథరాయ్! హఠాత్తుగా అమల హృదయం దడదడ మన్నది. వారితో పెళ్లా! ఇది జరుగుతుందా? వారి నవలల్లోని కొన్ని పేజీలు తనకి కంఠోపాఠం! క్లాసులో పాఠ్యగ్రంథాల మధ్య దాచి వారి నవలలు యెన్నిసార్లు చదవలేదు? ఆధునిక రచయితల్లో వారి రచనలంటేనే, ఆమెకి యిష్టం! వారికి స్త్రీలమీద తీవ్రమయిన ద్వేష ముంది. కాని వారి రచనలు యెంత రసవత్తరంగా వుంటవి! వారి పుస్తకాలు యెన్ని సార్లు చదివినా మళ్లీ చదవాలని పిస్తుంది.

వారు రచనల్లో స్త్రీలను యింతకటువుగా విమర్శిస్తారే! అది యెలా సహించడం? స్త్రీలమీద తీవ్రమయిన ద్వేష మున్న వ్యక్తి, వివాహం దేనికి చేసుకుంటున్నట్టు? ఒకవేళ యిదంతా భేషజమేమో—లభ్యం కాని వస్తువుకోసం తపస్సేమో! అయితే దీన్ని విరోధభక్తి అని చెప్పవచ్చు!

'వాణి' లో అమల వారి ఫోటో చూసింది. వారి విస్ఫారిత నేత్రాల్లో యెంత ఔద్ధత్యం వుంది. ఇవాళ ఆ నేత్రాలే ఆమెకి గుర్తుకొస్తున్నవి.

ఆమె లోలోపల అనుకునేది—తేజస్సు, ఔద్ధత్యము లేని వ్యక్తి పురుషుడెలా అవుతాడు? తేజోవిహీన మయిన పురుషుని వంక, తను కన్నెత్తికూడా చూడదు.

మరుచటిరోజు పొద్దున్నే లేచి, తల్లి వద్దకు వెళ్లి వివాహానికి తన సమ్మతి తెలియ పరిచింది.

అమల పెళ్లినాడు చుట్టపక్కాల్ని, స్నేహితుల్ని అందర్నీ పిలిచింది. తను యింత గొప్ప పండితుణ్ణి పెళ్లాడుతున్నానని చూపించటమే ఆమె ముఖ్యోద్దేశం! సంతోషంతో, మందహాసంతో ఆమె మోము ప్రకాశిస్తూవుంది. అందరూ వచ్చారో లేదో నని ఒకసారి వోరగా చూసింది. పెళ్లికి వచ్చినవారిలో కొంతమంది సోమనాథ్ ఆటోగ్రాఫ్ తీసుకోవటం చూసి, ఆమె హృదయం ఆనందంతో పుప్పొంగుతూ వుంది.

వివాహం కాగానే పూరీ వెళ్లారు. ముందుగానే అక్కడ మంచి హోటల్లో గది వొకటి కుదుర్చుకొన్నారు. భర్తతో కలిసి ప్రయాణం చేయటంలో యెంత ఆనందం వుంది! ఇంత గొప్పరచయితభార్య అయినందుకు, ప్రజలు తనను ఆదరంగా చూస్తారు. వారు తనను వెంటపెట్టుకుని సభలకు, విందులకు వెళ్లినప్పుడు, మనస్సు యెలా సంతోషంతో తేలియాడుతుందో నని వూహించుకుంటూ వుంటే, అమల గగుర్పాటు చెందుతూవుంది.

కాని పూరీ వెళ్లినాక, అమల హతాశురాలయింది. సరిగా ఆసమయంలో పూరీలో ఉత్సవం జరుగుతుంది. జనం కిటకిటలాడుతున్నారు. వీరిని పలకరించినవాళ్లు గాని, మర్యాద చేసినవాళ్లు గాని యెవరూ లేరు. ఇక్కడ సోమనాథ్ పుస్తకాలు చదివినవాళ్లు యెవరూ లేరా? కనీసం వారిపేరైనా యెవరూ వినివుండలేదా?

ఇద్దరూ సముద్రంవొడ్డున నిలబడి వున్నప్పుడు, ప్రజలు వారివంక చూస్తుంటే, అమలహృదయం దడదడ కొట్టుకునేది. వారు సోమనాథ్‌ని గుర్తుపట్టి, నమస్కరించి, తమవద్దకి వస్తున్నారనుకునేది. దారిని పోతూ పక్కవాళ్లు తమని గురించే, గుసగుస లాడుతున్నారని వూహించుకునేది. ఎవరో సోమనాథ్‌ని గుర్తించి, పక్కవాడితో చాలా నెమ్మదిగా 'అడుగో, ప్రసిద్ధ రచయిత సోమనాథ్, అతని భార్య' అని చెపుతున్నట్టుగా వుండేది. కాని, ఇదంతా శుద్ధకల్పనే! వారితో మాట్లాడటానికి యెవరూ రాలేదు. కనీసం పోట్లాడటానికికూడా రాలేదు!

ఒక వారం యిలానే గడిచిపోయింది. అప్పుడు అమల తనే అందర్నీ పలకరించ సాగింది; భర్తని గురించి పరిచయ వాక్యాలు చెప్పి—"వారు వ్రాసిన 'గర్వితధాత్రి' మీరు చదవలేదా? సంవత్సరంలో మూడు ఎడిషన్లు వచ్చినయ్!" అనేది. కాని అమల యెవరివద్దకి వెళ్లియిదంతా చెప్పేదో, వారు లజ్జాభావంతో నవ్వి—"లేదండీ...మంచిది మీరు యిక్కడ యింకా యెన్నాళ్లు వుంటారు? భువనేశ్వరం వెళ్లరా?" అనేవాళ్లు. అమల కాసేపు వూరుకుని, ముఖం తిప్పి—"వెళ్లము" అని జవాబిచ్చేది!

ఇంత అనాగరికులవద్ద ఇంక ఆశించతగ్గది యేముంటుంది? అమలకి తనమీద అంతులేని జాలి అక్రోశం కలిగినాయి.

బెంగాల్ సహాయనిధి వసూళ్లు—అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ గారి వద్ద విరాళం వసూలు చేసేముందు ఆయన షేర్వాణీమీద జాతీయపతాకాన్ని గ్రుచ్చుతున్న శ్రీమతి కె. పి. యస్. మీనన్.

ఆవాళే అమల సోమనాథ్ వద్దకు వెళ్లి - "పదండి, రేపే యిక్కడినించి వెళ్లిపోదాము" అంది.

సోమనాథ్ ఆమె మనస్సులోని విషయాన్ని గ్రహించలేదు. "ఇటువంటి అందమయిన ప్రదేశం వదిలి, వెళ్లాలంటున్నావేం? నాకు ఇప్పుడప్పుడే వెళ్లాలని లేదు. రాత్రింబవళ్లు యీ అనంతజలధి వంక చూస్తూ కూచోవాలనిపిస్తూంది."

అమల కొంచెం ఆలోచించి— నాకూ యీ ప్రదేశం బాగానే వుంది. కాని యింకా యితరస్థలాలకి కూడా వెళ్లాలిగదా?" అంది.

రాత్రికి వారిద్దరూ హోటలుకు తిరిగి వచ్చేటప్పటికి, ఇద్దరు యువకులు యెదురు చూస్తూవున్నారు. మర్నాడు సాయంకాలం గ్రంథాలయంలో సాహిత్యసభ యేర్పాటుచేశారు. దానికి అధ్యక్షత వహించవలసినదని సోమనాథ్‌ని కోరారు. అమల నేత్రాలు ఆనందంతో తళతళ మెరుస్తున్నవి. ఆయువకులు వెళ్లేటప్పుడు, ఆమెని కూడా ఆహ్వానించారు.

మరుసటిరోజు సరిగ్గా యేడుగంటలకి సభ ప్రారంభ మవుతుంది. అమల అయిదు గంటలనించే టాయిలెట్ చేసుకోవటం మొదలెట్టింది. సభకి బాగానే జనం వస్తారు. ఫలానా వారి భార్య అని తెలుసుకుని, అందరూ తనవంక చూస్తారు. అందువల్ల చక్కగా అలంకరించుకునే వెళ్లాలి. అదీగాక ఇప్పుడు తనకే వొక స్థాయి ఏర్పడింది! వారిని తీసుకెళ్లటానికి యథాసమయానికి కారు వచ్చింది.

అమల అక్కడికి వెళ్లినాక, చాలా ఆశ్చర్యపోయింది. వారు లోపలికి వెళ్లటానికి యెటు చూసినా సందు లేదు. చివరికి వెనకవాకిలిగుండా పోయి వేదికమీద కూచున్నారు. హాల్లో ఖాళీలేక కిటికీ చువ్వలుకూడా పట్టుకు నిలబడ్డారు జనం. ఒక రచయితని సన్మానించటానికి ఇంత ప్రజానీకం వచ్చినందుకు, అమలహృదయం అహంకారపూరిత మయింది.

సరిగ్గా యేడింటికి సభాకార్యక్రమం ప్రారంభిద్దా మనుకుని, ఆర్గనైజరుతో— "ఇంకా ఆలస్యం దేనికి?" అన్నాడు సోమనాథ్.

అతను సవినయంగా— "ప్రార్థన చేయటానికి సుప్రసిద్ధసినిమానటుడు మజుమ్‌దారుకోసం మనిషి వెళ్లాడు. వారు రాగానే ప్రారంభించుదాము" అన్నాడు.

పది పదిహేనునిమిషాలకి కారుహారన్ వినపడింది. వెంటనే జనంలో కలవరం బయలుదేరింది. నవీనమజుమ్‌దారు భార్యాసమేతంగా హాల్లో అడుగు పెట్టగానే కరతాళధ్వనులతో హాలు ప్రతిధ్వనించిపోయింది.

అమల దీనికి యేదోవొకవిధంగా ఫీలయింది. తనూ, భర్తతో కలిసి హాల్లో ప్రవేశించినప్పుడు, చప్పట్లు చరిచారుకాని ఇలా గట్టిగా, వుత్సాహంగా యెవరూ చప్పట్లు కొట్టలేదు. కరతాళధ్వనులు శాంతించగానే అమల వోరగా తన పక్కన కూచున్న మజుమ్‌దారుభార్య కట్టుకున్న జార్జెట్ చీరె వంక చూసింది.

సభ ప్రారంభ మయింది. నవీన మజుమ్‌దారు ప్రార్థన చేయసాగాడు. జనప్రీతిని పొందిన తన సినిమాపాటలు కూడా కొన్ని పాడాడు. జనం మళ్ళీ చప్పట్లు చరిచారు.

బహుజనుల కోరికమీద యింకా రెండు పాటలు పాడాడు. చివరికి ఆయన లేచి నిలబడి నమస్కరించి— "నాకు యిక టైము లేదు. సినిమాలో వొక యెంగేజిమెంటు వుంది. ఇందుకు మీరందరూ నన్ను మన్నించమని కోరుతున్నా"నని చెప్పి భార్యాసమేతంగా సెలవు తీసుకోగానే, సభలో పెద్ద కలకలం బయలుదేరింది.

"దయయుంచి, మీరందరూ శాంతంగా వుండవలసింది." అని ఆర్గనైజరు విజ్ఞప్తి చేశాడు. కాని అతనిమాట ఎవరాలకిస్తారు? అయిదు నిమిషాల్లో హాలంతా ఖాళీ అయిపోయింది. అంతా నెట్టుకుంటూ పోయి, మజుమ్‌దారు కారుచుట్టూ చేరారు.

చివరకి మిగిలిన శ్రోతలతోనే సభాకార్యక్రమం సాగించారు. సోమనాథ్ అధ్యక్షోపన్యాసం చేసి కూచునేప్పటికి, యెదురుగా బెంచీలమీద పిల్లకాయలు వృద్ధులు మాత్రం మిగిలివున్నారు.

సభాంతాన ఆర్గనైజరు, సోమనాథ్‌కి వారిభార్యకి ధన్యవాదా లర్పిస్తుంటే, అమల స్తబ్ధుగా కూచునివుంది. ఆమె యెటూ కన్నెత్తి చూడలేదు. వొంట్లో బాగాలేదని చెప్పింది.

"అయితే కొంచెం టీ అయినా తీసుకోండి" అని వొకతను టీ తీసుకొచ్చి ముందు పెట్టాడు.

అమలకు టీ కూడా అరుచిగానేవుంది. రెండు గుక్కలు తాగి టీ కిందపెట్టి జేబురుమాలుతో మూతి తుడుచుకుంది.

కారులో హోటలుకి తిరిగివచ్చేటప్పటికి బాగా పొద్దుపోయింది. రోడ్డుమీద జనసంచారం లేదు. రోడ్డుకి రెండువైపులా వున్న పెద్ద పెద్ద చెట్లు రాక్షసుల మాదిరి తలలు వంచుకుని నిలబడివున్నవి. దూరంగా సముద్రగర్జన వినిపిస్తూవుంది. ఆ భయంకర వాతావరణంలో కారు వేగంగా పోతూవుంది.

అమల నిశ్శబ్దంగా కూచునివుంది. ఆమె ముఖాన కఠోరత కాన్పిస్తూవుంది.

సోమనాథ్ మాట్లాడించటానికి ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది. అమల ధ్యానమగ్నవలె, స్తబ్ధుగా నిశ్చలంగా వుంది.

కారుదిగి, హోటల్లోకి వెళ్లినాక- "ఫలహారం యేమీ తీసుకోలే దేం?" అన్నాడు సోమనాథ్.

అమల యేమీ జవాబివ్వలేదు. మౌనంగా వుంది.

సోమనాథ్ కొంచెం ఆగి, మళ్లీ - "ఫలహారం ఘట్టుగా వుంది. ఇక్కడి తీపి -చమ్‌చమ్ - మంచి ప్రసిద్ధ!" అన్నాడు.

అమల అప్పటికీ మౌనంగా వుండటం చూసి - "ఏమిటి అలా వున్నావు అమలా?" అన్నాడు సోమనాథ్.

"ఏమో"

"కాదు చెప్పు! యెందుకు నవ్వింత గంభీరంగా వుంటున్నావు?"

అమలకళ్లెదుట, అప్పుడు హాసోజ్వలమయిన నవీనమజుమ్‌దారుభార్య ముఖం ప్రత్యక్షమయింది. ఇవాళ తనకంటె అదృష్టవంతురాలు యెవరూ లేనట్టు, గర్వంతో, అహంకారంతో ఆమెకి కాళ్లు నేలమీద ఆనటం లేదు.

సోమనాథ్ మళ్లీ అడిగాడు— ఏమి జరిగిందో చెప్పు రాణీ!"

ఈసారి అమల విసుక్కుని - "నాకు తెలియదు. దయయుంచి నన్ను పలకరించమాకండి" అంది.

సోమనాథ్‌కి యేమీ అర్థంకాక, మెదలకుండా వూరుకున్నాడు. అమల దీర్ఘంగా నిట్టూర్చింది. అమల ఆ సమయాన కూడా నవీనమజుందార్ భార్య అదృష్టాన్ని గురించి యోచిస్తూవుంది.